క్లుప్తంగా

పీఎం స్వనిధికి దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో నివాసం ఉంటూ వీధి విక్రయ వ్యాపారాలు చేసే వారికి పీఎం స్వనిధి పథకం ద్వారా బ్యాంకుల రుణాల మంజూరుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వీఎంసీ పట్టణ సామాజికాభివృద్ధి విభాగం ప్రాజెక్ట్ అధికారి(పీవోయూసీడీ) కె.శకుంతల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పీఎం స్వనిధి పథకం ద్వారా 7 శాతం వడ్డీరేటుతో వివిధ బ్యాంకుల ద్వారా మొదటి విడతగా రూ.10 వేలు, రెండో విడత రూ.20 వేలు, మూడోవిడత రూ.50 వేలు రుణాలు మంజూరు చేస్తామన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు స్థానిక సచివాలయం వార్డ్ వెల్ఫేర్ సెక్రటరీ లేదా మెప్మా రిసోర్స్ పర్సన్‌లను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తు ఆన్‌లైన్ చేయటానికి ఆధార్ కార్డు, ఆధార్‌లింక్ అయ్యిన ఫోన్ నెంబరు, బ్యాంక్ ఎకౌంట్‌తో సచివాలయాల్లో సంప్రదించాలన్నారు.

అవయవ దానంపై అవగాహన అవసరం

పాయకాపురం(విజయవాడరూరల్): అవయవ దానంపై అవగాహన అవసరమని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జి డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. న్యూరాజీవ్‌నగర్, పాయకాపురంలోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో గురువారం భారతీయ అవయవ దాన దినోత్సవం జరిగింది. వెంకటేశ్వర్లు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఓపీడీ రోగులకు అవయవ దానం ప్రాముఖ్యతను వివరించారు. మనం మరణించిన తరువాత కూడా అవయవ దానం చేయడం ద్వారా సగటున తొమ్మిది మందికి జీవితాన్ని అందించవచ్చన్నారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఎస్.సి.ఎస్.పి క్యాంప్ ద్వారా ప్రజలకు అవయవ దానం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వారితో, ఓపీడీ రోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమ అనుసంధానకర్త ఏజేవీ సాయి ప్రసాద్, సంస్థ అధికారులు, సిబ్బంది ఓపీడీ రోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి నోవాటెల్‌లో హైయ్ లైఫ్ ఎగ్జిబిషన్



భవానీపురం(విజయవాడపశ్చిమ): భారతదేశపు ట్రెండ్ సెట్టర్ అయిన హైయ్ లైఫ్ ఎగ్జిబిషన్ ద్వారా అత్యుత్తమ బ్రైడల్ కలెక్షన్‌ను షాపింగ్ చేయవచ్చు. ఈ ఎగ్జిబిషన్ విజయవాడలోని నోవాటెల్ వరుణ్ హోటల్‌లో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు కొనసాగుతోంది. ఈ తాజా వెడ్డింగ్ ఎడిషన్ ద్వారా ప్రతిష్టాత్మక వేడుకల్లో వారి సృజనాత్మకతను ప్రదర్శించేందుకు ప్రముఖ బ్రాండ్‌ల వివాహ దుస్తులు, పెళ్లికి అవసరమైన వస్తువులు, ఆభరణాలు అందుబాటులో ఉంటాయి.

జీవో నంబర్ 107, 108లను రద్దు చేయాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాజ్యాంగానికి విరుద్ధంగా సంపన్న వర్గాలకు వైద్య విద్యను అందించేందుకు దోహదం చేసే జీవో నంబర్ 107, 108లను రద్దు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని ఎం.విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, ప్రజారోగ్యవేదిక ఆధ్వర్యంలో ప్రజారోగ్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ జరిగింది. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైద్య విద్యలో సీట్లు అమ్ముకునేందుకు చేసే ప్రయత్నం సరైన చర్య కాదన్నారు. ఈ చర్యను రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. అనంతరం కార్యాచరణ ప్రణాళికపై తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ నెల 7న క్షేత్రస్థాయిలో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని, 8న రాష్ట్ర, జిల్లా అధికారులకు అర్జీలు ఇవ్వాలని, 10న బహిరంగ సంతకాల సేకరణ చేపట్టాలని, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యాలయం వద్ద మహాధర్నా చేయాలని సదస్సు తీర్మానించింది. సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.అశోక్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తల్లి పాలు అమృతంతో సమానం

పాయకాపురం(విజయవాడరూరల్): తల్లి పాలు బిడ్డలకు అమృతంతో సమానమని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ క్రాంతి కిరణ్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం 61వ డివిజన్ పరిధిలో డాక్టర్ క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది తల్లి పాలు ఇవ్వడాన్ని ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా ముర్రుపాలు బిడ్డకు తాగించడం మర్చిపోకూడదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న వైఎస్సార్ కిట్లు గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎం సుందరమ్మ, సీఓ మణి, అంగన్‌వాడీ టీచర్లు గాయత్రి, హసినా, ఆశా వర్కర్లు దుర్గాలక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.

శరవేగంగా నగరాభివృద్ధి

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి
- రూ.80 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నగర మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు

పాయకాపురం(విజయవాడరూరల్): నగరాభివృద్ధే ధ్యేయంగా, సంక్షేమ పథకాలు ప్రజల హక్కుగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 63, 64 డివిజన్ల పరిధిలో రూ.80 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు మోదుగుల తిరుపతమ్మ, యరగొర్ల తిరుపతమ్మతో కలిసి గురువారం ఆయన భూమిపూజ చేశారు. విజయవాడ నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నారని, అందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా నగరం అన్ని విధాలా అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తోందని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. తమ పాలన వచ్చాక నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల, కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా పనులు జరిగేవి కావని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రజాప్రతినిధులే ఇంటింటికి వెళ్లి ప్రజల అవసరాలను గుర్తిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. అన్ని డివిజన్లలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్ల దుస్థితిని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి రావడంతోనే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, పనులు చేపడతున్నామని ఆయన చెప్పారు. ఇందులో భాగంగా రూ.19.96 లక్షలతో 63వ డివిజన్ ఉడా కాలనీ ఆంజనేయస్వామి గుడి రోడ్డు, రూ.19.97 లక్షలతో రాధానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశామన్నారు. 64వ డివిజన్‌లో రూ.19.87 లక్షలతో కమ్యూనిటీ హాల్ రోడ్డు, రూ.19.97 లక్షలతో కండ్రిక సెంటర్ వద్ద మరో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. వీలైనంత త్వరగా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మరో వైపు కండ్రిక గ్రామం నుంచి ఎస్ఎస్‌సీ బోస్ నగర్ వరకు రూ.3.30 కోట్లు, కండ్రిక – ఉడా కాలనీలను కలుపుతూ రూ.2.50 కోట్ల డీఎంఎఫ్‌టీ ఫండ్లతో బీటీరోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలుస్తామని చెప్పారు.

అభివృద్ధి చేసి చూపించాం..

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. గత తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాగితాలపై తప్ప పనులు ఎక్కడా కార్యరూపం దాల్చిన దాఖలాలు లేవని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల కాలంలో అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించామని పేర్కొన్నారు. ప్రతి సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షల నిధులతో, ప్రజల సౌకర్యం కోసం అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు నేతృత్వంలో నియోజకవర్గం అభివృద్ధిలో కొత్తపుంతలు తొక్కుతుందని మేయర్ అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్న ఈ ప్రభుత్వాన్ని మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఈఈ (ఇంజినీరింగ్) శ్రీనివాస్, 30వ డివిజన్ కార్పొరేటర్ జానారెడ్డి, నాయకులు పసుపులేటి యేసు, మోదుగుల గణేష్, సీహెచ్ రవి, ఎం.రాజేశ్వరి, పందిరివాసు, జె.శివ, వరాలమ్మ, మాతా మహేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సింగ్‌నగర్‌లో డీసీపీ ఆకస్మిక పర్యటన



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకూ డీసీపీ విశాల్ గున్ని అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఆకస్మికంగా పర్యటించారు. ప్రధానంగా ఆకతాయిల సమస్యలు అధికంగా ఉంటున్న వాంబేకాలనీ, సింగ్‌నగర్ లూనాసెంటర్, న్యూరాజరాజేశ్వరీపేట శివారు ప్రాంతాలను స్వయంగా పరిశీలించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆకతాయిల సమస్యలు, ఇతర శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలు ఏమైన ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ప్రజల వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్‌తో పాటు పలు క్రైమ్ రికార్డులను పరిశీలించి ఎస్‌హెచ్ఓలకు పలు సూచనలు అందించారు. నార్త్‌జోన్ ఏసీపీ రవికాంత్, సీఐ గురుప్రకాష్, ఎస్ఐలు దుర్గాదేవి, సత్యనారాయణ, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రం సస్యశ్యామలం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే విష్ణు



స్థానిక సమస్యలపై పోలీస్ అధికారితో చర్చిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శ పాలనను అందిస్తున్నారని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలోని 265వ వార్డు సచివాలయం పరిధిలో గురువారం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన సీ బ్లాక్‌లోని 510 ఇళ్లను సందర్శించి స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించి, అన్ని అర్హతలు ఉన్నా పథకాలు పొందుకోని వారి వివరాలను తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి గడప ముంగిటకే ప్రభుత్వాన్ని తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 265వ వార్డు సచివాలయం పరిధిలోని ప్రజలకు రూ.8.90 కోట్ల వరకూ సంక్షేమ పథకాల ద్వారా సహాయాన్ని అందించామని వివరించారు.

చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదం:

వై నాట్ పులివెందుల అని ప్రతిపక్ష నేత చంద్రబాబు మాట్లాడడం ఈ శతాబ్దంలోనే అతిపెద్ద జోక్ అని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. పులివెందుల గురించి మాట్లాడుతున్న చంద్రబాబు ఈసారి కుప్పంను కాపాడుకుంటే గగనమని వ్యాఖ్యానించారు. 30 ఏళ్లగా కుప్పం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన చంద్రబాబు కనీసం కుప్పాన్ని రెవెన్యూ డివిజన్ చేసుకోలేకపోయారని, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే నిజమైన అభివృద్ధి, సంక్షేమాన్ని కుప్పం ప్రజలు అందించారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కార్పొరేషన్ యూజీడీ డీఈ రామకృష్ణ, సీడీఓ జగదీశ్వరి, నాయకులు బెవర నారాయణ, బత్తుల దుర్గారావు, పొదిగింటి నాగరాజు, ఎండీ ఇస్మాయేల్, సిరిశెట్టి రాజా, ఎస్‌డీ బాబు, పఠాన్ నాగూర్, అలీ, ఫాతిమా, గోపి, ఉమా, సౌజన్య పాల్గొన్నారు.

ఓటర్లకు మార్గనిర్దేశం చేయడమే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



బీఎల్‌ఓల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఓటర్లకు మార్గనిర్దేశం చేయడమే బీఎల్‌ఓల లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నగరంలోని సెంట్రల్, వెస్ట్ నియోజకవర్గాల్లో బూత్ స్థాయి అధికారులకు(బీఎల్‌ఓలు) తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం సమగ్ర శిక్షణా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. సమాచారం, సమ్మిళిత ఎన్నికల ప్రక్రియను ప్రోత్సహించే దిశగా సర్వే నిర్వహించాలని బీఎల్‌ఓలకు సూచించారు. పౌరుల భాగస్వామ్యాన్ని పెంపొందించటం, సమర్థవంతమైన ఎన్నికల ప్రక్రియను నిర్ధారించేందుకు అవసరమైన నైపుణ్యాలతో బీఎల్‌ఓలను శక్తివంతం చేయడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారాలు చేయడం, అలాగే నివాసితుల నుంచి విలువైన అభిప్రాయాలను పొందడం, కొత్త రిజిస్ట్రేషన్ల కోసం ఫారమ్‌లనే పూర్తి చేసేందుకు అర్హులైన ఓటర్లకు మార్గనిర్దేశం వంటివి చేయడమే లక్ష్యంగా బీఎల్‌ఓలు పని చేయాలన్నారు. ప్రత్యేకించి వారు మరణించిన ఓటర్ల నమోదులు, వలస వచ్చిన వారి ఓట్ల తొలగింపులను నిర్వహించే ప్రక్రియ ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పౌరులకు, ఎన్నికల వ్యవస్థకు మధ్య ప్రత్యక్ష కమ్యూనికేషన్ మార్గాలను ఏర్పాటు చేయడంలో బీఎల్‌ఓల ప్రాముఖ్యతను వివరించారు. సెంట్రల్, వెస్ట్ నియోజకవర్గాల ఎమ్మార్వోలు, నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, వీఎంసీ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వీధి కుక్కలను నియంత్రించే దిశగా చర్యలు



సమీక్షిస్తున్న నగర మేయర్ భాగ్యలక్ష్మి, అధికారులు, ప్రజాప్రతినిధులు

పటమట(విజయవాడతూర్పు): నగర పరిధిలో రోజుకు 100 కుక్కలను పట్టుకోవాలని, ఆపరేషన్ యూనిట్‌లో యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) ఆపరేషన్లు నిర్వహించాలని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఆమె గురువారం వీధి కుక్కల సమస్య పరిష్కారానికి వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పెంపుడు కుక్కల యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పెంపుడు కుక్కలకు యాంటీరేబీస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) టీకాలు వేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్ల వారీగా యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) గురించి మైక్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. వీధి కుక్కల ప్రేమికులు, కాలనీ ప్రతినిధులతో తరచూ సమావేశాలు నిర్వహించాలని పేర్కొన్నారు. హోటళ్లు, మాంసం విక్రేతలపై సక్రమంగా పారేయని వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధి కుక్కల సమస్యలకు టోల్‌– ఫ్రీ నెంబర్ 1800 425 2000 వీఎంసీ, 81819 60909 వీఎంసీ వాట్సప్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఫ్లోర్ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి, సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, కార్పొరేటర్లు బీ జానారెడ్డి, శిరంశెట్టి పూర్ణచంద్ర రావు, ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి), పుప్పాల కుమారి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రవిచంద్, జంతు ప్రేమికులు, జీవకారుణ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హనుమంతరాయ గ్రంథాలయం అభివృద్ధికి కృషి

విజయవాడకల్చరల్: వెనిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆ గ్రంథాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు అన్నారు. గ్రంథాలయ ప్రాంగణంలో గ్రంథాలయ సభ్యుల ఆత్మీయ సమావేశం, ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ప్రారంభ కార్యక్రమం గురువారం నిర్వహించారు. శంకరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 90 ఏళ్ల క్రితం గ్రంథాలయం ప్రారంభమైందని ఈ ఏడాది ఆధునిక సౌకర్యాలతో గ్రంథాలయాన్ని, కళా వేదికను రూ.25 లక్షల వ్యయంతో పునఃనిర్మించామని తెలిపారు. కార్యక్రమాన్ని సాహితీవేత్త ఎంఆర్ఎస్ ప్రకాశరావు నిర్వహించారు. గ్రంథాలయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాంప్రసాద్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. సమావేశంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ పూర్వపు అధ్యక్షుడు బెల్లపు బాబ్జీ, గ్రంథాలయ నిర్వాహక సంఘం సభ్యులు, మహిళా విభాగం అధ్యక్షురాలు దూపాటి శ్రీదేవి, నీలం దుర్గారావు, ఆజం, గడ్డం సత్యనారాయణ పాల్గొన్నారు. వాటర్ ప్లాంట్‌కు సహకరించిన డోగిపర్తి నాగార్జునను నిర్వాహకులు సత్కరించారు.

తల్లీ బిడ్డలకు సంపూర్ణ పోషకాహారం



29వ డివిజన్‌లో కిట్‌లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మీపతి



24వ డివిజన్‌లో కిట్‌లు అందజేస్తున్న కార్పొరేటర్ అనిత

మధురానగర్(విజయవాడసెంట్రల్): తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసమే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ పంపిణీ కార్యక్రమంను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష అన్నారు. స్థానిక 31వ డివిజన్ పసుపుతోట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జరపాల శైలజ, శశిరేఖ, కల్పన, సామ్రాజ్యం పాల్గొన్నారు. 29వ డివిజన్ మధురానగర్‌లో కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి చేతుల మీదుగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. 30వ డివిజన్ విజయదుర్గానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేశారు. చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

24వ డివిజన్‌లో..

లబ్బీపేట(విజయవాడతూర్పు): గర్భిణులు, బాలింతలకు తగిన పోషకాహారం అందించేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ప్రవేశపెట్టిందని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేశారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బిడ్డకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటితరానికి ఆదర్శం కాకాని వెంకటరత్నం



గ్రంథాలయానికి కూలర్ అందజేస్తున్న తరుణ్ కాకాని తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వాతంత్ర్య సమరయోధుడు కాకాని వెంకటరత్నంను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని డెప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో వ్యవసాయ, పాడిపరిశ్రమ శాఖ మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం 123వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని, డెప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు కాకాని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డెప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కృష్ణా జిల్లా ఆకునూరులో జన్మించిన కాకాని జిల్లా బోర్డు అధ్యక్షుడిగా, మూడు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. జై ఆంధ్ర ఉద్యమానికి మార్గదర్శకుడిగా నిలిచారన్నారు. కాకాని వెంకటరత్నం జయంతిని పురస్కరించుకుని కాకాని ఆశయ సాధన అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ గ్రంథాలయానికి వాటర్ కూలర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి.రవి కుమార్, సర్వోదయ ట్రస్టు, స్వాతంత్ర్య సమరయోధుల సంఘం సహాయ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణలో తొలగించిన కాకాని విగ్రహాన్ని బెంజ్‌సర్కిల్ వద్ద ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సాధన సమితి కార్యదర్శి గుమ్మడి రామకృష్ణ, గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, సిబ్బంది జి.ఉమారాణి, వై.ధనలక్ష్మి, డి.రమేష్, కే.రాంబాబు, కుమార్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం తెలంగాణా సిరిసిల్లకు చెందిన దాత సహకారంతో 500 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. తొలుత బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీసాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు పర్యవేక్షించారు.

మొక్కలకు ట్రీ గార్డుల ఏర్పాటు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ దేవీనగర్ నుంచి దావుబుచ్చయ్యకాలనీ వరకు బుడమేరు పక్కన ఇటీవల నాటిన మొక్కలకు గురువారం ఉద్యానవన శాఖ సిబ్బంది ట్రీగార్డులు ఏర్పాటు చేశారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు స్థానికులు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సహకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

విజేతలకు అభినందన



రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అబాకస్‌తో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, మానసిక ధైర్యం పెరుగుతుందని ఎస్ఎన్‌పురం సిప్ అబాకస్ నిర్వాహకురాలు శైలజ అన్నారు. స్థానిక ఎస్ఎన్‌పురం సిప్ అబాకస్ కార్యాలయంలో గురువారం సాయంత్రం అబాకస్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల జరిగిన సిప్ అబాకస్ అండ్ అర్థమెటిక్ రాష్ట్రస్థాయి పోటీల్లో 80 మంది విద్యార్థులు ప్రతిభను చాటటం అభినందనీయమన్నారు. గ్రాండ్ మాస్టర్ లెవెల్‌లో ఏ ఆదిత్య శ్రీ వర్ధన్ చాంపియన్‌షిప్ గెలుపొందగా, ప్రథమ, ద్వితీయ, తృతీయ లెవెల్‌లో షణ్ముక జయసంతోష్ ప్రథమ స్థానం, నందిపాటి ప్రియాన్ష ద్వితీయ స్థానం, వినయ్, రాంనివేద్, మేఘన రత్నప్రభ, లక్ష్మీసుధన్వి, ఆరాధ్య, యువన్, తేజగ్ని చౌదరి, మహత్వి, శ్యామ్‌సంతోష్, ఇ మోక్షిత్, రెహాన్, నిహార్, కార్తికేయ తృతీయ స్థానంలో నిలిచారన్నారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ భాస్కరరావు, సీఐ కృష్ణమోహన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏసీపీ భాస్కరరావు పిలుపునిచ్చారు. సీపీ టీకే రాణా ఆదేశాల మేరకు గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం సీఐ కృష్ణమోహన్, సిబ్బందితో కలిసి విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా స్ట్రీట్‌వాక్, వాహనాల రికార్డుల చెకింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా యువకులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాల్సిన ఆవశ్యకతను, గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో గుణదల సీఐ కృష్ణమోహన్, ఎస్ఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బాబా మందిరంలో సంకట చతుర్ధి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో శుక్రవారం సంకట చతుర్ధిని పురస్కరించుకుని మందిరంలోని విజయ వినాయకునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదోష కాలంలో సంకట చతుర్ధి రావటం విశేషమన్నారు. భక్తులు విజయ వినాయకుని దర్శించుకుని, పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): భర్త అదృశ్యంపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వాంబే కాలనీకి చెందిన సలాది సురేష్(33) విజయవాడ బీసెంట్‌రోడ్డులో ప్రతి రోజు మొబైల్ బండిపై పండ్లు, ప్లాస్టిక్ వస్తువుల వ్యాపారం చేస్తూ రాత్రికి ఇంటికి వచ్చేవాడు. గత నెల 10వ తేదీన బీసెంట్‌రోడ్డు వ్యాపారానికి వెళ్లిన తన భర్త తిరిగి ఇంటికి రాలేదని, ఫోను స్విచ్ఛాఫ్ వస్తోందని అతని భార్య సలాది రామలక్ష్మి నున్న పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కలరా హాస్పిటల్ ప్రాంతానికి చెందిన కట్టా నవ్యశ్రీదుర్గ 2019లో శ్రీనివాసమహల్ ప్రాంతానికి చెందిన శ్రీనును ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఒక పాప సంతానం. మార్బుల్ పని చేసే శ్రీను కొంత కాలంగా మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను, పాపను పట్టించుకోవడం లేదు. కాపురానికి ఇకపై రానని చెబుతూ భార్యను వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.